క్లుప్తంగా

పోలీస్ విధులపై విద్యార్థులకు అవగాహన



తాళ్లపూడి పోలీస్ స్టేషన్‌లో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

తాళ్లపూడి: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా వారోత్సవాలు నిర్వహిస్తున్నట్టు కొవ్వూరు రూరల్ సీఐ బి.విజయబాబు తెలిపారు. దీనిలో భాగంగా తాళ్లపూడి పోలీస్ స్టేషన్‌లో వేగేశ్వరపురం ఇంటర్ కళాశాల విద్యార్థులకు ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు పోలీస్ సిబ్బంది విధులు, స్టేషన్‌లో రికార్డులు, పరికరాలను గురించి వివరించారు. మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తాళ్లపూడి ఎస్సై టి.రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

8న జాతీయ మెగా లోక్‌అదాలత్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా తొమ్మిదో అదనపు జడ్జి అనురాధ

కొవ్వూరు: ఈ నెల 8న కొవ్వూరులో నిర్వహించే జాతీయ మెగా లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా తొమ్మిదో అదనపు జడ్జి ఎం.అనురాధ సూచించారు. కోర్టు హాలు శనివారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. లోక్ అదాలత్‌లో కేసులు రాజీ చేసుకోవడం ద్వారా సమయం, డబ్బు ఆదా అవుతాయన్నారు. ఇన్సురెన్స్ కేసులు, ఇతర కేసులను మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించుకోవాలన్నారు. ఎక్కువ కేసులు పరిష్కరించే విధంగా న్యాయవాదులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యాగంటి చలపతిరావు, కోడూరి నరసింహరావు, వుప్పల కృష్ణారావు, తాడేపల్లి ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా త్రిశూలస్నానం



అన్నవరప్పాడులో కోనేరులో త్రిశూల స్నానం చేయిస్తున్న దృశ్యం

పెరవలి: అన్నవరప్పాడులో వేంచేసిన ఉమా విశ్వేశ్వరస్వామి వారి కల్యాణోత్సవాల్లో భాగంగా శనివారం కోనేరులో స్వామి వారి త్రిశూల స్నానం ఆచరించారు. ఆలయం నుంచి బాజాభజంత్రీలు, మేళతాళాలతో పండితులు వేద మంత్రాలతో బయలుదేరి కోనేరులో స్నానం ఆచరించారు. భక్తులు ఓం నమఃశివాయ అంటూ శరణుఘోషతో ఈ ప్రాంతం దద్దరిల్లింది. భక్తులు, పండితులు అర్చకులు సామూహికంగా త్రిశూల స్నానం చేయించారు.

వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడిని కలసిన రమేష్‌బాబు



రాజమహేంద్రవరంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు వేణుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న రమేష్‌బాబు

కొవ్వూరు: వైఎస్సార్ సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు కంఠమణి రమేష్‌బాబు శనివారం ఆ పార్టీ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి చెల్లుబోయిన వేణు గోపాలకృష్ణను మర్యాద పూర్వకంగా కలిశారు. రాజమహేంద్రవరంలో ఆయనను కలసి పుష్పగుచ్ఛం అందజేశారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని, పార్టీలో యువత భాగస్వామ్యం పెంచేదిశగా చర్యలు తీసుకోవాలని జిల్లా అధ్యక్షుడు వేణు గోపాలకృష్ణ సూచించారు. కార్యక్రమంలో చిట్టూరి అన్నవరం, కారింకి వెంకటేశ్వరరావు, కొడవటి దేవా తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

కొవ్వూరు: పట్టణ శివారున గామన్ ఇండియా బ్రిడ్జి సమీపంలో గోదావరి నదిలో శనివారం గుర్తుతెలియని మృతదేహం లభ్యమైనట్లు పట్టణ ఎస్సై కె.జగన్‌మోహన్‌రావు తెలిపారు. మృతుడి వయస్సు సుమారు 60 ఏళ్లు ఉంటుందన్నారు. 14వ నంబర్ పిల్లర్ వద్ద మృతదేహం లభ్యమైనట్లు ఆయన తెలిపారు. మృతుడి వద్ద ఏ విధమైన ఆధారాలు లభ్యం కాలేదన్నారు. వివరాల కోసం పట్టణ పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలని ఆయన సూచించారు.

కొబ్బరి అ'ధర'హో

- నాడు ధర రూ.6 వేలు, నేడు రూ.9 వేలు
- రైతులకు కలసి వస్తున్న పెరిగిన ధరలు
- నియోజకవర్గంలో 1,200 ఎకరాల్లో కొబ్బరి సాగు



ఖండవల్లిలో కొబ్బరికాయలు ఒలుస్తున్న కూలీలు

పెరవలి: కొబ్బరికాయల దిగుబడి పెరగడం మరోవైపు మార్కెట్‌లో మంచి గిట్టుబాటు ధర లభిస్తుండడంతో రైతులు, వ్యాపారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్‌లో వెయ్యి కాయలకు నాణ్యతను బట్టి రూ.14 వేల నుంచి రూ.16 వేల వరకు కొనుగోలు చేస్తున్నారు. రైతులకు మాత్రం కాయ ఒక్కటి రూ.8 నుంచి రూ.9 మాత్రమే ధర లభిస్తుంది. దింపు కూలీ, మోత కూలి, ఒలుపు కూలి, రవాణా ఖర్చులు ఎక్కువవ్వడం వలన రైతులకు పెరిగిన ధర లభించడం లేదు. కానీ దిగుబడి పెరగడంతో ఆదాయం లభిస్తోంది. గతంలో ఎకరం కొబ్బరి తోటలో దింపు తీస్తే గతంలో నెలకు 500 కాయలు దిగుబడి వస్తే ప్రస్తుతం 1200 నుంచి 1500 కాయల వరకు దిగుబడి ఉందని రైతులు చెబుతున్నారు. గతంలో ధర తక్కువ వుండి దిగుబడి తగ్గినా రైతుల చేతికి ఏ మాత్రం సొమ్ములు మిగిలేవి కాదని వచ్చిన ఆదాయం కూలీలకు సరిపోయేదని ఇప్పుడు ఆదాయం పెరగడంతో రైతులకు మిగులు వస్తుందని అంటున్నారు. గత ఏడాది కాలంగా కొబ్బరి చెట్లుకు తెగుళ్లు సోకడంతో పాటు మార్చిలో ధర తక్కువగా ఉండటంతో ఉన్న దిగుబడిని బొండాలకు కోయటంతో దిగుబడి తగ్గిపోయింది. అప్పటి నుంచి గత నెల వరకు వెంటాడిన దిగుబడి ప్రభావం ప్రస్తుతం తోటలు కోలుకోవడంతో దిగుబడి పెరిగి, గిట్టుబాటు ధర లభించటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

నియోజకవర్గంలో కొబ్బరి విస్తీర్ణం

నిడదవోలు నియోజకవర్గంలో కొబ్బరితోటలు 1200 ఎకరాలు ఉండగా నిడదవోలులో 500 ఎకరాలు, ఉండ్రాజవరంలో 400 ఎకరాలు, పెరవలి మండలంలో 300 ఎకరాల్లో సాగుచేస్తున్నారు. ఇవి కాకుండా ఇళ్ల వద్ద, పొలాల గట్ల వెంబడి, కాలువ గట్లు, లంకల్లోను వేలాది చెట్ల ద్వారా కొబ్బరిసాగు జరుగుతోంది. దిగుబడి తగ్గడానికి గత ఏడాది ఏప్రిల్‌లో తెల్లదోమ ఆశించటంతో కొబ్బరిచెట్లు పూర్తిగా పాడైపోయాయి. ఇదే కాకుండా అంతకు ముందు ఉన్న తెగుళ్ల ప్రభావం కూడా దిగుబడిపై పడి కొబ్బరికాయలకు కొరత వచ్చిందని చెబుతున్నారు. ప్రస్తుతం బహిరంగ మార్కెట్లో కాయ ఒకటి సైజుని బట్టి రూ.15 నుంచి రూ.20లకు అమ్ముతున్నారు.

కలసివచ్చిన మహాకుంభమేళా

కొబ్బరికి ఇంత డిమాండ్ రావడానికి మహాకుంభమేళా కూడ ఒక కారణమయింది. గతంలో ఉత్తర ప్రదేశ్‌కు కొబ్బరి ఎగుమతులు ఉండేవి కావు. కానీ మహాకుంభమేళా పుణ్యమా అంటూ రోజు 100 నుంచి 150 లారీల కొబ్బరి కాయల ఎగుమతి జరిగింది. ముఖ్యంగా ఉభయగోదావరి జిల్లాల నుంచి ప్రతి రోజుల 50 నుండి 60 లారీలు ఎగుమతయ్యాయి. దీంతో పాటు శివరాత్రి, పండగలు రావడంతో కొబ్బరికి డిమాండ్ ఏర్పడి రేటు గణనీయంగా పెరిగింది.

రైతులకు ఒరిగిందేమీ లేదు



మూడేళ్లుగా కొబ్బరికాయలకు ధర పెరుగుతున్నా రైతులకు ఒరిగేది ఏమీలేదు. దిగుబడి తగ్గి, గిట్టుబాటు ధర పెరుగుతుందే తప్ప రైతులకు కలసి వచ్చేదేమీ లేదు. చెట్లకు తెగుళ్ల సోకడం వలన దిగుబడి తగ్గిపోయింది. ప్రస్తుతం చెట్లు కోలుకోకపోవడంతో పాటు గిట్టుబాటు ధర లభించడంతో ఆదాయం వస్తుంది.

– సంఖు ప్రభాకరరావు, కొబ్బరి రైతు, మల్లేశ్వరం

దిగుబడి పెరిగింది



గత నాలుగేళ్లలో ఈ పరిస్థితి ఎప్పుడూ చూడలేదు. ప్రస్తుతం ధరతో పాటు దిగుబడి పెరగడంతో రైతులకు కలసివస్తున్నది. మార్కెట్ ఎప్పుడు ఎలా ఉంటుందో చెప్పలేకపోతున్నాం. మార్కెట్ ఇలా నిలకడగా ఉంటే అందరికీ కలసి వస్తుంది.

– అడబాల బ్రహ్మయ్య, కొబ్బరికాయల వ్యాపారి, అన్నవరప్పాడు

ధరలు ఇలా..

మార్కెట్‌లో 1000 కొబ్బరికాయలను రూ.14 నుంచి రూ.16 వేలకు కొనుగోలు చేస్తుండగా రైతులకు మాత్రం రూ.8 వేల నుంచి రూ.9 వేలు మాత్రమే ఇస్తున్నారు. గత ఏడాది ఇదే సమయంలో కొబ్బరి రేటు రూ.6 వేలు మాత్రమే ఉండేది. వ్యాపారస్తులు కూడా కొబ్బరి రాశులు ఉంటే అక్కడికక్కడే 1000 కాయలకు రూ.11 నుంచి 12 వేలకు కొనుగోలు చేస్తున్నారు. అదే వ్యాపారస్తుడే తీత తీసి కొబ్బరి కాయలను మోసి గుట్టగా వేస్తే రైతులకు మాత్రం రూ.8 నుండి రూ.9 వేలు ఇస్తున్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు

నిడదవోలు: పట్టణంలో వేంచేసిన గోలింగేశ్వర స్వామి వారి ఆలయంలో దేవదాయ ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో శనివారం హుండీ ఆదాయం లెక్కించారు. 121 రోజులకు గాను కార్తికమాసం, మహాశివరాత్రి పురస్కరించుకొని రూ.98,072 ఆదాయం వచ్చింది. హుండీ లెక్కింపులో తాడేపల్లి గూడెం ఇన్‌స్పెక్టర్ బీఎల్ లక్ష్మీనరసింహారావు పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఆలయ మేనేజర్ నామా సూర్యప్రకాష్‌రావు, ఆలయ అర్చకులు శ్రీకాకుళపు వెంకటేశ్వరరావు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

రామకృష్ణ పరమహంస జయంతి



వేడుకల్లో పాల్గొన్న భక్తులు

నిడదవోలు: స్థానిక రామకృష్ణ సేవా సమితిలో శనివారం భగవాన్ శ్రీరామకృష్ణ పరమహంస జయంతి ఘనంగా నిర్వహించారు. విష్ణు సహస్రనామం, లలిత సహస్రనామ పూజులు, భజనలు, హారతి నిర్వహించారు. అనంతరం ప్రసాదం పంపిణీ చేశారు. కార్యక్రమంలో సాగర్, ఎమ్మెల్సీ రాంబాబు, సోమేశ్వరరావు, మనోహర్, వి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలు ప్రారంభం



కొవ్వూరు పరీక్ష కేంద్రానికి వచ్చిన ఇంటర్ విద్యార్థులు



వేగేశ్వరపురం పరీక్ష కేంద్రం వద్ద హాల్ టికెట్ల నంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు

తాళ్లపూడి: వేగేశ్వరపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరం పరీక్షలు శనివారం ప్రారంభమయ్యాయి. పరీక్షా కేంద్రానికి ఉదయం 8 గంటల నుంచే విద్యార్థులు చేరుకున్నారు. తొలిరోజు తెలుగు/సంస్కృతం పరీక్షలకు 301 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 280 మంది హాజరయ్యారు. 21 మంది పరీక్షకు గైర్హాజరైనట్టు అధికారులు తెలిపారు. ఈ పరీక్షా కేంద్రంలో తాళ్లపూడి కరిబండి గనిరాజు సూర్యకుమారి జూనియర్ కళాశాల, తాళ్లపూడి ఒకేషనల్ జూనియర్ కళాశాల, అన్నదేవరపేట, వేగేశ్వరపురం కళాశాల విద్యార్థులు పరీక్షలు రాశారు. పరీక్షలకు చీఫ్ సూపరింటెండెంట్‌గా పి.గౌరీనాథ్ డిపార్టమెంటల్ ఆఫీసర్‌గా డి.శ్రీనివాస్ వ్యవహరించారు. తాళ్లపూడి ఎస్సై టి.రామకృష్ణ, పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

కొవ్వూరు: ఇంటర్‌మీడియెట్ మొదటి సంవత్సరం పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. పట్టణంలోని ప్రభుత్వోన్నత పాఠశాల (బాలురు), జెడ్పీ ఉన్నత పాఠశాల (బాలికలు)ల్లో పరీక్షలు నిర్వహించారు. తొలిరోజు తెలుగు, హిందీ, సంస్కృతం పరీక్షలు నిర్వహించారు. బాలుర హైస్కూల్‌లో 302 మందికి 289 మంది హాజరయ్యారు. 14 మంది గైర్హాజరయ్యారు. బాలికల హైస్కూల్‌లో 176 మందికి గాను 17 మంది గైర్హాజరయ్యారు.

చాగల్లు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు ఫస్ట్ ఇయర్ తెలుగు పరీక్షకు 148 మంది విద్యార్థులకు గాను 136 మంది పరీక్షలకు హాజరయ్యారు. 12 మంది గైర్హాజరైనట్టు పరీక్షల సూపరింటిండెంట్ కేపీ పావని తెలిపారు. సోమవారం ఇంటర్ సెకండ్ ఇయర్ పరీక్షలు ప్రారంభమవుతాయని తెలిపారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

గోపాలపురం: మండలంలోని గౌతమీ జూనియర్ కళాశాల, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలలో ఇంటర్ పరీక్షలు ప్రశాంతం జరిగాయి. మొత్తం 546 మంది విద్యార్థులకు గానూ 37 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు. గౌతమి కళాశాలలో 237 మంది గాను 216 మంది హాజరుకాగా 21 మంది, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలలో 309 మందికి గానూ 296 మంది హాజరుకాగా 13మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు చెప్పారు.

జోరుగా పింఛన్ల పంపిణీ



పెరవలిలో పింఛన్ పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ వెంకటరమణ

నిడదవోలు రూరల్: నిడదవోలు మండలంలోని 23 గ్రామాల పరిధిలో ఉన్న 10,310 పింఛన్లు ఉండగా శనివారం 9,838 మందికి తొలిరోజు 95.4 శాతం పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ డి.లక్ష్మీనారాయణ తెలిపారు. సమిశ్రగూడెం, గోపవరం, డి.ముప్పవరం గ్రామాల్లోని దివ్యాంగులకు మండల ప్రత్యేకాధికారి ఎ.దుర్గేష్ పింఛన్ల నగదును అందించారు. పింఛన్ల పంపిణీలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. పంచాయతీ కార్యదర్శులు కె.శ్రీనివాసరావు, భార్గవిదేవి తదితరులు పాల్గొన్నారు.

పెరవలిలో 93.93 శాతం

పెరవలి: మండలంలో శనివారం ఎన్టీఆర్ పింఛన్ భరోసాలో మొదటి రోజు 93.93 శాతం పింఛన్ల పంపిణీ జరిగిందని ఎంపీడీఓ సీహెచ్ వెంకటరమణ తెలిపారు. మండలంలో అన్ని రకాల పింఛన్లు కలిపి 10,171 మంది లబ్ధిదారులు ఉన్నారని, వీరిలో 9554 మందికి పింఛన్లు ఇచ్చామన్నారు. ప్రతి గ్రామంలో సచివాలయ సిబ్బంది, రెవెన్యూ, పంచాయతీ రాజ్ సిబ్బంది సంయుక్తంగా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారని తెలిపారు.

వైఎస్సార్ సీపీ నేత రాజబాబు మృతికి సంతాపం



రాజబాబు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, మాజీ మంత్రి తానేటి వనిత, మాజీ ఎంపీ శ్రీధర్, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు తదితరులు

దేవరపల్లి: అనారోగ్యంతో ఇటీవల మృతి చెందిన వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెలికాని రాజబాబు సంతాపసభ శనివారం ద్వారకాతిరుమల మండలం సీహెచ్ పోతేపల్లిలోని ఆయన స్వగృహం వద్ద జరిగింది. వైఎస్సార్ సీపీ తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, మాజీ మంత్రి తానేటి వనిత, మాజీ ఎంపీ కోటగిరి శ్రీధర్, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు తదితరులు రాజబాబు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. రాజబాబు మృతి పార్టీకి తీరని లోటు అని నేతలు పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ దేవరపల్లి, నల్లజర్ల, గోపాలపురం, ద్వారకాతిరుమల మండలాల అధ్యక్షులు కూచిపూడి సతీష్, వెల్లంకి సుబ్రహమణ్యం, వెలగా శ్రీరామూర్తి, ప్రతాపనేని వాసుబాబు, పార్టీ నాయకులు బంకా అప్పారావు, బొండాడ వెంకన్నబాబు, జ్యోతి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ సైనికుడి మృతికి వనిత సంతాపం

నల్లజర్ల: స్వాతంత్ర్య సమరయోధుడు వల్లూరి సుబ్బన్న కుమారుడు, మాజీ సైనికుడు వల్లూరి సూర్యచంద్రరావు నల్లజర్లలో ఇటీవల మృతి చెందారు. ఆయన దాదాపు 20 సంవత్సరాలు సైనిక ఉద్యోగిగా సేవలు అందించారు. ఆయన కుటుంబ సభ్యులను మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ తానేటి వనిత శనివారం పరామర్శించారు. ఆమె వెంట వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ వెల్లంకి వెంకట సుబ్రహ్మణ్యం, నాయకులు బంక అప్పారావు, వల్లూరి శేషగిరిరావు, మేణ్ణి యువరాజు, కారుమంచి రమేష్, ఉప సర్పంచ్ రాయుడు విజయ కుమార్, వల్లూరి వెంకన్న, రాయుడు ప్రసాద్ తదితరులున్నారు.

రామకృష్ణ భక్త మందిరంలో..

ఇదిలా ఉండగాస్థానిక రామకృష్ణ భక్త మందిరంలో 49 రోజుల పాటు నిర్వహిస్తున్న సప్తసప్తాహాల కార్యక్రమంలో వనిత పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం



కొవ్వూరులో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

కొవ్వూరు: ఎస్సీ వర్గీకరణ కోసం ప్రాణాలు అర్పించిన మాదిగ అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని దళిత వర్గాల ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చెట్టే రాజు అన్నారు. కొవ్వూరు మెరకవీధిలోని బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద శనివారం మాదిగ అమరవీరుల సంస్మరణ దినోత్సవం నిర్వహించారు. రాష్ట్ర కార్యదర్శి కొడమంచిలి విజయ్‌కుమార్, ఇతర నాయకులు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కొవ్వొత్తులతో అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ ఇటీవల ఎస్సీ వర్గీకరణపై అంసెబ్లీలో తీర్మానం చేసి అమరవీరుల కుటుంబాలకు రూ.5 లక్షలు చొప్పున సాయం అందించినందుకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఏపీలో రాష్ట్ర ప్రభుత్వం నియమించిన రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్ నివేదిక ఈ నెల 15వ తేదీ లోపు వస్తుందన్నారు. అనంతరం ఎస్సీలను ఏబీసీడీలుగా విభజించి విద్య, ఉద్యోగ రంగాల్లో మాదిగలకు తగిన ప్రాధాన్యత కల్పించాలని కోరారు. మాదిగ రిటైర్డు ఉద్యోగుల సంఘం నాయకులు పెనుమాక జయరాజు, పెద్దాడ ఏసుబుజ్జి, చీలి ప్రసాద్, మార్లపూడి అచ్చిబాబు, మల్లిపూడి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక స్థాయి నుంచే క్రీడాకారులు తయారు కావాలి

నల్లజర్ల: ప్రాథమిక స్థాయి నుంచే క్రీడాకారులు తయారు కావాల్సి ఉందని రాష్ట్ర కబడ్డీ జట్టు క్రీడాకారుడు జి.శ్రీకాంత్ అన్నారు. గత నెల 20 నుంచి 23వ తేదీ వరకూ కటక్‌లో జరిగిన 71వ జతీయ కబడ్డీ పోటీల్లో ఆయనను స్వగ్రామం అనంతపల్లిలో ఉషోదయ పబ్లిక్ స్కూలు యాజమాన్యం శనివారం ఘనంగా సత్కరించింది. ఈ సందర్భంగా శ్రీకాంత్ విద్యార్థులకు కబడ్డీలో మెళకువలు వివరించారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు విభిన్న ఆలోచనలు, సృజనాత్మకతతో ముందుకు సాగాలన్నారు. బాల్యం నుంచే విభిన్నంగా ఆలోచించడం అలవాటు చేసుకోవాలని సూచించారు. జీవితంలో సాధించాలనుకున్నదానిని పొందే వరకూ విశ్రమించరాదన్నారు. ఓటములను తట్టుకునే మానసిక స్థైర్యాన్ని పెంపొందించుకొని సంపూర్ణ వ్యక్తిత్వం సాధించాలని చెప్పారు. మారుతున్న జీవనశైలిలో ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతి విద్యార్థీ ఏదో ఒక క్రీడపై మక్కువ చూపాలని అన్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ మీసాల శ్రీనివాస చెల్లారావు, ప్రిన్సిపాల్ ఎం.శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వెంకన్న దర్శనానికి పోటెత్తిన భక్తులు



విశేష అలంకరణలో వేంకటేశ్వరస్వామి

పెరవలి: తూర్పుగోదావరి జిల్లాలో రెండో ద్వారకా తిరుమలగా పేరుగాంచిన అన్నవరప్పాడు వేంకటేశ్వరస్వామి ఆలయానికి శనివారం వేలాది మంది భక్తులు పోటెత్తారు. స్వామి, అమ్మవార్లను వివిధ రకాల పూలతో అలంకరించడంతో భక్తులు స్వామిని చూసి తరించారు. తెల్లవారుజామున 4 గంటలకే మహిళా భక్తులు పెద్ద ఎత్తున తరలిరావడంతో స్వామి వారి అభిషేకం కనులారా వీక్షించారు. స్వామి వారికి అభిషేకం నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. 7 గంటల తరువాత ఆలయానికి వేలల్లో భక్తులు రావడంతో దర్శనానికి గంట సమయం పట్టింది. ఆలయానికి వచ్చిన భక్తులకు ఉదయం ఉచిత ప్రసాదాల పంపిణీతో పాటు 10 గంటల నుంచి అన్నసమారాధన నిర్వహించారు. ఈ అన్నదానంలో 5 వేల మంది భక్తులు ప్రసాదాలు స్వీకరించారని ఆలయ ఈఓ మీసాల రాధాకృష్ణ తెలిపారు. ఇటీవల నూతనంగా ఆలయంలో ప్రవేశపెట్టిన నిత్య గోత్రనామార్చన, శుక్రవారం అభిషేకం గోత్ర నామార్చనకు, స్వామికి పూల అలంకరణ, ప్రసాదం, అన్నదానానికి భక్తుల నుంచివిరాళాలు సేకరించడంతో భక్తుల నుంచి అనూహ్య స్పందన లభిస్తుందని ఆయన తెలిపారు.

పారిశుధ్యంపై అవగాహన అవసరం



దేవరపల్లిలో తడి, పొడి చెత్తపై మహిళలకు అవగాహన కల్పిస్తున్న డీపీఓ శాంతమణి, డీఎల్‌పీఓ అమ్మాజీ

చాగల్లు: మండలంలోని 13 గ్రామ పంచాయతీల్లో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ నిర్వహించినట్టు ఎంపీడీఓ ఎ.శ్రీదేవి తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు దగ్గరుండి పారిశుధ్య పనులను చేయించారు. క్లాప్ మిత్రల ద్వారా ప్రతి ఇంటి నుంచి చెత్తను సేకరించి గ్రామంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలకు తరలించారు. తడి, పొడి చెత్తల నిర్వహణపై అవగాహన కల్పించారు. ఈవోపీఆర్డీ శ్రావణ్‌కుమార్ చాగల్లు, బ్రాహ్మణగూడెం, కలువలపల్లి, చిక్కాల గ్రామాల్లో పనులను పర్యవేక్షించారు.

దేవరపల్లిలో..

దేవరపల్లి: స్పెషల్ శానిటేషన్ డ్రైవ్‌లో భాగంగా దేవరపల్లిలో నిర్వహించిన స్పెషల్ శానిటేషన్ డ్రైవ్‌లో భాగంగా నిర్వహించిన పారిశుధ్య పనులను జిల్లా పంచాయతీ అధికారి శాంతామణి, డివిజినల్ పంచాయతీ అధికారిణి వై.అమ్మాజీ పరిశీలించారు. ఉదయం 6.30 గంటలకు గ్రామ పంచాయతీ కార్యాలయానికి చేరుకుని పారిశుధ్య కార్మికులతో మాట్లాడారు. ఇంటింటా తడి, పొడి చెత్త సేకరణపై కార్మికులకు సూచనలు చేశారు. ఇంటిలో ఉపయోగించిన తడి, పొడి చెత్తను డంపింగ్ యార్డుకు తరలించి వాటి ద్వారా వర్మీ కంపోస్ట్ తయారీ విధానాన్ని వివరించారు. గ్రామంలోని వివిధ గ్రామాల్లో పర్యటించి ప్రజలకు తడి, పొడి చెత్త గురించి వివరించారు. ఇంటిలోని తడి, పొడి చెత్తను చుట్టుపక్కల, పరిసర ప్రాంతాల్లో చెత్తను పారవేయకుండా డస్ట్‌బిన్‌లో ఉంచితే పంచాయతీ కార్మికులు సేకరించి డంపింగ్ యార్డుకు తరలిస్తారని డీపీఓ శాంతామణి తెలిపారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ విస్తరణ అధికారి రాజారావు, పంచాయతీ కార్యదర్శి నిట్టా రవికుమార్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్

గోపాలపురం: పారిశుధ్యంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా పంచాయతీ అధికారి కె.శాంతామణి అన్నారు. గోపాలపురంలోని కుమ్మరకుంటలో శనివారం పారిశుధ్యంపై మహిళలకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ ఇంటి పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతపై కూడా మహిళలు దృష్టి సారించాలన్నారు. తడి, పొడి చెత్తలపై అవగాహన కల్పించారు. పారిశుధ్యం ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని గ్రామ కార్యదర్శి అనురాధకు ఆదేశించారు. ఆమె వెంట కొవ్వూరు డీఎల్‌పీవో వై.అమ్మాజీ, ఎంపీడీవో జి.శ్రీనివాసరావు, ఎంఆర్‌సీ ఎన్.బాబూరావు పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్యంపై దృష్టి సారించాలి

తాళ్లపూడి: పంచాయతీ కార్యదర్శులు పారిశుధ్య నిర్వహణపై దృష్టి సారించాలని జిల్లా పంచాయతీ అధికారి వి. శాంతామణి సూచించారు. మండలంలోని అన్నదేవరపేటలో ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్‌ను శనివారం పరిశీలించారు. ఇంటింటా చెత్త సేకరణపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డీఎల్‌పీవో వై.అమ్మాణి, ఎంపీడీవో టీబీ వెంకటరమణ, ఇవోపీఆర్డీ కేవీఎస్ వీరన్న, పంచాయతీ కార్యదర్శి డీవీఎస్‌సీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

